క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి

నేరడిగొండ: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏటీడీవో సౌజన్య అన్నారు. బుధవారం మండలంలోని లఖంపూర్ బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే విద్యతో పాటు భోజనం, వసతి, ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గంగాసింగ్, వార్డెన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజన క్రీడల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

ఇచ్చోడ: గిరిజన క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల్లో అండర్– 14 బాలికల కబడ్డీ పోటీల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐటీడీఏ ద్వారా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏటీడీవో సౌజన్య, గిరిజన క్రీడాల అధికారి పార్థసారధి, పోటీల కన్వీనర్ పాఠశాల హెచ్‌ఎం ఉత్తందాస్, పీఈటీల సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, పీఈటీలు గోపాల్, నాందేవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతాం’

బోథ్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామని పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. జనాభా ప్రాతిపాదికన 10 సీట్లు పద్మశాలికి చెందిన వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కోరుట్లలో జరిగిన పద్మశాలి సంఘం సభలో తీర్మానం చేసి, ఆయా పార్టీలను కోరడం జరిగిందన్నారు. పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, వడ్లకొండ సురేందర్, అనిల్ మాసం, సిరిపురం చంద్రమోహన్, సత్తయ్య, లక్ష్మణ్, శేఖర్, బాలరాజు, గణేష్, స్వామి, నరేందర్ పాల్గొన్నారు.

పోస్టుకార్డుతో సీఎం దృష్టికి సమస్యలు

ఆదిలాబాద్‌టౌన్: సర్వీసును క్రమబద్ధీకరించడంతో పాటు టైం స్కేల్‌ను వర్తింపజేయాలని విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు కోరారు. బుధవారం సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డుల ద్వారా తమ సమస్యలను విన్నవించడంతో పాటు విద్యాశాఖ, ఆర్థిక, ఐటీ మంత్రులకు ఉత్తరాలు పోస్టు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. 15 ఏళ్లకు పైగా విద్యాశాఖలో సేవలు అందిస్తున్నామని, అయినప్పటికీ ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించలేదన్నారు. కేజీబీవీ సిబ్బంది, ఎమ్మార్సీ సిబ్బంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

హైరిస్క్ ప్రసూతి కేసులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ సాధన

గుడిహత్నూర్: హైరిస్క్ ప్రసూతి కేసులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వారి ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన చికిత్స అందించాలని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సాధన అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతల వివరాలను వైద్యాధికారి శ్యాంసుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఓపీ రిజిస్ట్రేషన్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట డీఐవో విజయ సారథి, ఫార్మసిస్ట్ శివాజీ ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఉట్నూర్ ఆర్డీవో జీవారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుమురం భీం ప్రాంగణం నుంచి పలు వీధుల గుండా అంబేద్కర్ చౌక్ వరకు 5కే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఎస్సై మనోహర్, డిప్యూటీ తహసీల్దార్ భుజంగ్‌రావు, అధ్యక్షుడు కపిల్ జాదవ్, పీడీ విశ్వనాథ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే పశువుల సంచారం



బోథ్‌లో రోడ్లపై సేదతీరుతున్న పశువులు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- గ్రాసం లేక వదిలేస్తున్న యజమానులు

బోథ్: వాహనదారులకు అకస్మాత్తుగా పశువులు అడ్డు రావడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. బోథ్ మండల కేంద్రంలో రోజూ పదుల సంఖ్యలో వాహనదారులు గాయపడుతున్నారు. యజమానులు తమ పశువులను రోడ్లపై వదిలేయడంతో ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకుండా పోతోంది. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద, మార్కెట్ రోడ్డు, మార్కండేయ ఆలయం, భగత్‌సింగ్ కాలనీ, హనుమాన్ కాలనీలో పశువులు రోడ్లపైనే తిరుగుతున్నాయి. ఆహారం లేక రోడ్లపై ఉన్న ప్లాస్టిక్‌తో పాటు పలు రకాల వ్యర్థ పదార్థాలను తింటున్నాయి. దీంతో పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయి. మార్కండేయ ఆలయం వద్ద ఉన్న దుకాణదారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఎన్నిసార్లు చెప్పినా.. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రాసం కొరత..

పశువుల యజమానులు తమ పశువులకు ప్రతిరోజు గ్రాసం వేయకపోవడంతో రోడ్ల మీద తిరుగుతున్నాయి. గ్రాసం కొరత ఉండటంతో యజమానులు సైతం వదిలి పెడుతున్నారు. పశువులు ఎక్కడో తిని మళ్లీ ఇంటికి వచ్చేస్తున్నాయి. కానీ గ్రామంలో గ్రామస్తులు పడుతున్నా, ఇబ్బందులను పశువుల యజమానులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులు రోడ్లపై తిరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



పశువులను రోడ్లపై వదిలేయడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వృద్ధుల్లు రోడ్లపై నడవలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి పశువులను రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలి.

– జక్కుల వెంకటేశ్, బోథ్

రోడ్లపై వదిలేస్తే చర్యలు

పశువులను రోడ్లపై వదిలేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటాం. గతంలో పలుమార్లు చెప్పినా.. యజమానులు పట్టించుకోవడం లేదు. ఇకపై రోడ్లపై పశువులను వదిలేస్తే గోశాలకు పంపిస్తాం. యజమానులకు జరిమానా విధిస్తాం.

– అంజయ్య, పంచాయతీ కార్యదర్శి, బోథ్

‘కోవలక్ష్మిని గెలుపించుకుంటాం’

నార్నూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోవలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రం నుంచి పది వాహనాల్లో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బానోత్ గజానంద్‌నాయక్ అధ్వర్యంలో ఆసిఫాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవ లక్ష్మికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలు సైనికులుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంతరావు,



ఆసిఫాబాద్‌కు వెళ్తున్న నాయకులు

కార్యదర్శి సయ్యద్ ఖాశీం, కొర్రెల్ల మహేందర్, కాంతరావు దుర్గే, సుభాష్ రాథోడ్, షేక్ దాదేఅలీ, తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తాం

ఆదిలాబాద్‌టౌన్: అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పని చేస్తామని, అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని బీఆర్‌ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని బోథ్ ఎమ్మెల్యే నివాసంలో మాట్లాడారు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌కు పార్టీ అధిష్టానం టికెట్ ప్రకటించిందని, ఆయన గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కైలాస్‌నగర్: వృత్తి నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం న్యాక్ ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. మేస్త్రీ, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ వంటి అంశాల్లో న్యాక్ ద్వారా శిక్షణ పొందిన వారికి కిట్లు పంపిణీ చేశారు. వృత్తి నైపుణ్యాలు ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటే సత్ఫాలితాలు ఉంటాయన్నారు. గృహలక్ష్మి పథకం కింద పెద్ద ఎత్తున ఇల్లు నిర్మించనున్న నేపథ్యంలో శిక్షణ ఎంతో తోడ్పడుతుందన్నారు. శిక్షణ పొందినవారికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, ఇబ్బు, ప్రశాంత్, న్యాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న జోగు ప్రేమేందర్

పొగాకు రహితంగా మార్చేందుకు కృషి

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థలను పొగాకు రహితంగా మార్చాలనే ఉద్దేశంతో దశల వారీగా విద్యా సంస్థలను పరిశీలించడం జరుగుతోందని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీధర్ మెట్‌పెల్లివార్ అన్నారు. బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం ఉన్నత పాఠశాలను జిల్లా పొగాకు నియంత్రణ బృందం పరిశీలించారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు అమ్మడం, అమ్మించడం, వాడకం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాహుల్, క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలమ్మ, సోషల్ వర్కర్ చిరంజీవి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

ఓనం మహోత్సవాన్ని విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారులోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 29న నిర్వహించే ఓనం మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంబోజి సూర్యకాంత్ కోరారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. గణపతి హోమం, మహాభిషేకం, అష్టోత్తర పూజ, దివ్యపదినెట్టాంబడి పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దాముఖ రవీందర్, సాయికృష్ణ తాంత్రి, ఉపాధ్యక్షుడు గౌరు లక్ష్మణ్, నరేశ్, ఓరగంటి వెంకటేశ్, నగేశ్, రాము పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అతీష్‌కుమార్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఇన్‌చార్జి తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో మండల కేంద్రానికి చెందిన గిత్తే శంకర్‌రావ్ 188 సర్వే నెంబర్ భూమిలో గ్రంథాలయం ఏర్పాటుకు భూమి దానం చేశారని, ఆ స్థలంలో అన్ని సౌకర్యలతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆరీఫ్, వినోద్, నిలేష్, సంతోష్, బాబా, వినాయ్, విశాల్, గజానంద్ పాల్గొన్నారు.

కళాశాల అడ్మిషన్స్ అదుర్స్



సంబురాలు జరుపుకొంటున్న ప్రిన్సిపాల్

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశాలలో రికార్డ్ సృష్టించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాల్లో 400 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. జిల్లాలోనే అత్యధికంగా తాంసి కళాశాలలో ఈఏడాది విద్యార్థులు వివిధ గ్రూప్‌లో ప్రవేశాలు పొందినట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు సంబురాలు జరుపుకున్నారు.

తుడుందెబ్బ యువజన సంఘం అధ్యక్షుడిగా విష్ణు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా గేడం విష్ణును నియమించినట్లు తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం యువతకు చైతన్యం కల్పించి హక్కులు సాధించేలా పోరాడాలని పేర్కొన్నారు.

క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడవద్దు

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీ యువత క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలు చేసుకోవద్దని జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన యువతీ, యువకులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధకరమన్నారు. యువత లక్ష్యాన్ని నిర్దేశించుకొని వాటి సాధన దిశగా ముందుకెళ్లాలని సూచించారు.

సెల్‌ఫోన్‌కు బానిస కావద్దు

తలమడుగు: విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిస కావద్దని మహిత స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పిల్లల అభివృద్ధి, సాధికారత్పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నేడు చదువుపై ఆసక్తికరపరచడం లేదని, మొబైల్‌పై ఆసక్తి కనబర్చడంతో చదువుపై ఏకాగ్రత పోతుందన్నారు. విద్యార్థుల అభివృద్ధికి మహిత స్వచ్ఛంద సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణ, ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, ఏఎస్సైస సురేందర్, ఎంపీవో దిలీప్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

సిరికొండ: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఏఎస్సై రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన పలువురికి జరిమానా విధించారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ అర్జున్, ప్రేందర్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్ మగ్దూమ్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్‌లో అన్ని వర్గాలకు సమన్యాయం దక్కాలంటే సీపీఐ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు, కలవేని శంకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సిరికొండ: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు ఏఎస్సై రమేశ్ సైబర్ నేరాలుపై బుధవారం అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో 100 డయల్ చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల న ఉంచి ఫోన్లు వస్తే స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

బోథ్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అర్మూల్ ఎమ్మెల్యే కృష్ణ అన్నారు. అన్ని సర్వేలు బీజేపీ గెలుపును చూపిస్తున్నాయన్నారు. బుధవారం మండల కేంద్రంలో అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అందరూ కలిసికట్టుగా పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్మూల్ ఎమ్మెల్యే కృష్ణ

చంద్రయాన్–3 సక్సెస్ సంబురాలు



బోథ్: వీక్షిస్తున్న బోథ్ గ్రామస్తులు



సిరికొండ: జాతీయ జెండాతో యువకులు

బోథ్: చంద్రయాన్– 3 విజయవంతం కావడంతో బోథ్ మండల వ్యాప్తంగా సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఎల్ఈడీలో విద్యార్థులు, గ్రామస్తులు చంద్రునిపై చంద్రయాన్ ల్యాండ్ అయిన దృశ్యాలను వీక్షించారు. కొఠ(బి) గ్రామంలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జై భారత్ అంటూ నినాదాలు చేశారు.

జైనథ్: చంద్రయాన్– 3 విజయవంతం కావడంతో మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. ప్రత్యేకాధికారిణి వీణా ఆధ్వర్యంలో ప్రాజెక్టర్ సహాయంతో విద్యార్థులు వీక్షించారు. చంద్రయాన్ లైవ్‌ను ఉత్కంఠంగా చూసిన విద్యార్థులు, సేఫ్‌గా ల్యాండ్ అవడంతో విజయకేతనం చూపిస్తూ.. కేరింతలు కొట్టారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో చంద్రయాన్– 3 లాండింగ్‌ను యువకులు, పిల్లలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఆయా పాఠశాలల్లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. విజయవంతంగా చంద్రుడిపై దిగడంతో ప్రజలు, యువకులు సంబురాలు జరుపుకున్నారు.

సిరికొండ: చందమామపై చంద్రయాన్– 3ని విజయవంతంగా దిగడంతో మండలంలోని పోన్న గ్రామంలో ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. జాతీయ జెండాను పట్టుకొని జయహో భారత్.. జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. ఇలాంటి మరెవిజయాన్నో లు సాధించాలని ఆకాంక్షించారు.



జైనథ్: విజయకేతనం చూపుతున్న విద్యార్థినులు

కైలాస్‌నగర్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, చిన్నారులు, పెద్దలు సంబురాలు జరుపుకుంటున్నారు. బుధవారం ఐ లవ్ ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ వద్ద చిన్నారులు, విద్యార్థులు కేక్‌కట్ చేసి జాతీయ జెండాను పట్టుకొని తమ దేశభక్తిని చాటారు. ఇస్రోకు అభినందనలు తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాంసి: దివ్యాగులకు పింఛన్ రాష్ట్ర ప్రభుత్వం రూ.4016 అందజేయడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయం వద్ద బుధవారం దివ్యాంగులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం పింఛన్ పెంచుతూ దివ్యాంగుల ఆత్మ గౌరవాన్ని మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రజినికాంత్‌రెడ్డి, దివ్యాంగులు గంగారం, శ్రీనివాస్, సతీశ్ ఉన్నారు.

పిప్పల్‌కోటిలో..

భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం రూ.4016 పింఛన్ పెంచుతూ అందజేయడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుభాష్, ఇర్షద్, అనిల్, పెరోజ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించారు. అలాగే మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి రూ. 3 కోట్లు, కోర్టు భవనం కోసం రూ. 5 కోట్లు, సబ్‌ట్రెజరీ కార్యాలయ భవనానికి రూ. 50 లక్షలు మంజూరు చేయాలన్నారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ తెలిపారు.

39వ రోజుకు చేరుకున్న దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాలని చేస్తున్న దీక్షలు బుధవారం 39వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు కూర్చున్నారు. వీరికి పలువురు సంఘీభావం తెలిపారు. బోథ్‌ను డివిజన్ చేసే వరకు ఉద్యమాన్ని ఆపబోమని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు స్పష్టం చేశారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

బోథ్: దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో దివ్యాంగులకు రూ. 3016 నుంచి రూ. 4016 పెంచిన సందర్భంగా వారికి పెంపు పత్రాలు అందజేశారు. బీడీ కార్మికులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు. కాగా బోథ్, పొచ్చర గ్రామాలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ. 46,500ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, సర్పంచ్ సురేందర్, ఆత్మ చైర్మన్ సుభాష్, జగన్‌రెడ్డి, లింబాజీ, తాహెర్ బిన్ సలాం, మొట్టె కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు

- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తుందని, విద్యుత్ సరఫరాలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని సర్పంచ్ పెంట వెంకటరమణ మండిపడ్డారు. బుధవారం నేరడిగొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్ నివేదికలను వివరిస్తుండగా.. సర్పంచ్ పెంట వెంకటరమణ జోక్యం చేసుకొని కుప్టి ఫీడర్ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఉంటుందని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నారాయణపూర్ సర్పంచ్ జాదవ్ పరశురాం మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభం పడిపోయి ఆరు నెలలు అవుతున్నా.. సరిచేయలేదన్నారు. కావస్తున్నా దాన్ని సరిచేయలేదని ఆరోపించారు. తేజాపూర్ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఎందుకు ఎగురవేయలేదని ఎంపీపీ రాథోడ్ సజన్ ఎంఈవోను ప్రశ్నించారు. పశువైద్యాధికారి సుశీల్‌కుమార్ మాట్లాడుతుండగా.. మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తాళం వేసి ఉంటుందని, ప్రజాప్రతినిధులు అన్నారు. మండల అభివృద్ధికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి బిర్రు భాస్కర్, ఎంఈవో భూమారెడ్డి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ సమద్, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, సయ్యద్ లాలు, ఎంపీవో శోభన, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాథోడ్ సజన్